క్లుప్తంగా

మర్యాదపూర్వక కలయిక



నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ మత్స్యకార నాయకుడు డాక్టర్ మూగి శ్రీనివాసరావు గురువారం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు.

– అల్లిపురం

సిరులతల్లికి పంచామృతాభిషేకం



కనకమహాలక్ష్మి అమ్మవారు

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎరుకుమాంబ సన్నిధిలో అన్న సమారాధన



ఎరుకుమాంబ ఆలయ ఆవరణలో అన్నదానం చేస్తున్న ఆలయ ప్రతినిధులు

సీతమ్మధార: దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ అమ్మవారి దేవస్థానంలో మహా శివరాత్రి మారువారాన్ని పురస్కరించుకుని గురువారం అన్నసమారాధన జరిగింది. దేవస్థానం ఈవో రామాబాయి ఆధ్వర్యంలో అర్చకుడు శ్రీనివాస్ ముందుగా గణపతి పూజ అనంతరం అమ్మవారికి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ చైర్మన్, 27వ వార్డు కార్పొరేటర్ గొలగాని బుజ్జి, దేవస్థానం సిబ్బంది సత్యనారాయణరాజు, ధర్మకర్తల మండలి మాజీ చైర్మన్ అల్లూరి సత్యనారాయణరెడ్డి, మాజీ ధర్మకర్తలు గురుగోవింద్ సింగ్, మజ్జి వెంకట సత్యనారాయణ, చిట్టిబోయిన గంగరాజు, జి. గురునాథరెడ్డి, అల్లూరి రమేష్‌రెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

కాలినడకన తిరుపతికి

● రోజుకి 30 కిలోమీటర్ల ప్రయాణం



విద్యాసాగర్‌కు అభినందనలు తెలుపుతున్న బంధువులు, స్నేహితులు

అల్లిపురం: పూర్వం తీర్థయాత్రలు చేయాలంటే కాలినడకనే వెళ్లేవారు. దారి పొడవునా సత్రాల్లో విశ్రాంతి తీసుకుంటూ నడిచేవారు. అదే పద్ధతిని జీవీఎంసీ 34వ వార్డు మనోరమా ప్రాంతానికి చెందిన ఎల్ఐసీ ఏజెంటు బి.విద్యాసాగర్ ప్రయాణం చేయనున్నారు. వెంకటేశ్వరమెట్ట, శ్రీ బల్లిగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో పూజలు నిర్వహించిన అనంతరం బంధువులు, స్నేహితుల మధ్య తిరుపతికి బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనతో పాటు తన స్నేహితుడు తిరుపతి కాలినడకన ప్రయాణమవుతున్నారని తెలిపారు. రోజుకి 30 కిలోమీటర్లు చొప్పున ప్రయాణం చేస్తామన్నారు. 25 నుంచి 30 రోజుల్లో తిరుపతి చేరుకుంటామని తెలిపారు. ఆయనకు స్నేహితులు, బంధువులు శుభాకాంక్షలు తెలిపారు.

లెక్క తప్పింది?

● పూర్ణామార్కెట్‌లో దుకాణాలపై కొరవడిన స్పష్టత
● పలువురు వ్యాపారుల గుప్పిట్లో జీవీఎంసీ దుకాణాలు
● సొంతంగా అద్దెలకిచ్చి లబ్ధి పొందుతున్న వైనం

ఆక్రమణదారుల పేరిట ట్రేడ్ లైసెన్సులు..
వాస్తవంగా జీవీఎంసీ వేలం నిర్వహించి వ్యాపారులకు అప్పగించిన దుకాణాల కాలపరిమితి అయిపోయింది. అయితే ఇందులో అప్పటి వ్యాపారులు ఒక్కరూ లేరు. తర్వాత వచ్చిన వారు కూడా ప్రస్తుతం మార్కెట్‌లో ఎవరూ లేరు. కానీ దుకాణాలు మాత్రం చేతులు మారిపోయాయి. ట్రేడ్ లైసెన్సుల్లో కూడా పేర్లు మారిపోయాయి. అయితే ఇదంతా అధికారులకు తెలియకుండానే జరిగిపోతుందా అని ప్రశ్నించే వారు కూడా ఉన్నారు.



పూర్ణామార్కెట్ వ్యూ

జగదాంబ: వందేళ్ల చరిత్ర కలిగిన పూర్ణామార్కెట్‌లో ఏబీసీడీ కేటగిరీలుగా 730 దుకాణాలు ఉన్నాయి. ఎన్నో ఏళ్ల కిందట వీటికి వేలం నిర్వహించి వ్యాపారులకు అప్పగించారు. అప్పటి నుంచి జీవీఎంసీ సంవత్సరానికి ఒకసారి వేలం నిర్వహించి ఆశీలు వసూలు చేస్తూ పలువురు వ్యాపారులకు అందజేసింది. పూర్ణామార్కెట్ దుకాణాల అసలు తంతు ఇదీ.

ఆక్రమణదారులో చేతిలో వంద దుకాణాలు..
ఈ మార్కెట్‌లో ఉన్న దుకాణాల మధ్య ఫ్రూట్ మార్కెట్ కూడా ఉండేది. కాలక్రమేణా నగరం విస్తరించడంతో పాటు వ్యాపారాలు కూడా పెరగడంతో జీవీఎంసీ ఫ్రూట్ మార్కెట్ విభాగాన్ని పూర్ణామార్కెట్ నుంచి తొలగించి జనతా బజార్ వద్ద ఉన్న పాతబస్టాండ్ వద్ద ఏర్పాటు చేసింది. దీంతో మార్కెట్‌లో వంద పండ్ల దుకాణాలు ఖాళీ అయిపోయాయి. అయితే వెంటనే జీవీఎంసీ చర్యలు తీసుకోకపోవడంతో మార్కెట్‌లోని కొందరు వ్యాపారులు ఒక్కొక్కరు పది నుంచి 20 వరకు దుకాణాల వరకు ఆక్రమించుకున్నారు. తామే స్వయంగా వేరే వారికి రోజుకు రూ. 200 నుంచి రూ. 300 వరకు అద్దెలకు ఇచ్చుకుని స్వలాభం పొందుతున్నారు. జీవీఎంసీ కనీసం పట్టించుకోకపోవడంతో ఆక్రమణ దారులు ఆశీలు పేరుతో రూ. 35 మాత్రమే చెల్లించి మిగిలిన డబ్బు జేబులో వేసుకుంటున్నారు.

ఇప్పటికీ రూ. 35 మాత్రమే...
జీవీఎంసీ దుకాణ సముదాయాలకు ఆయా ప్రాంతాలను బట్టి ఒక్కో దగ్గర ఒక్కో విధంగా ధరలు నిర్ణయించి వేలం పాటలు నిర్వహిస్తున్నారు. అయితే పూర్ణామార్కెట్‌లోని దుకాణాలను మరిచిపోవడంతో ఇప్పటికీ రోజుకు రూ. 35 మాత్రమే వసూలు చేస్తున్నారు. పూర్ణామార్కెట్‌కు సమీపంలోనే ఉన్న స్ప్రింగ్‌రోడ్డు, జగదాంబ, లక్ష్మీ టాకీస్ వద్ద ఇలాంటి దుకాణాలకు రూ. వేలలో అద్దెలు వసూలు చేస్తున్నారు. దీని వల్ల జీవీఎంసీ ఆదాయానికి భారీగా గండి పడుతోంది.



పూర్ణామార్కెట్‌లో నిబంధనలకు వ్యతిరేకంగా నిర్మించుకున్న దుకాణాలు

నచ్చినట్లు నిర్మాణాలు..
ఇదిలా ఉంటే పూర్ణామార్కెట్‌లోని దుకాణాలను కొందరు వ్యాపారులు ఇష్టం వచ్చినట్లు నిర్మించుకుంటున్నారు. నాలుగు అడుగుల వెడల్పు అయిదడుగుల పొడవు చొప్పున ఒక వ్యాపారికి ఒక దుకాణం మాత్రం జీవీఎంసీ అప్పగించింది. అయితే వ్యాపారులు మాత్రం దుకాణాల పరిమాణాలను నచ్చినట్లు మార్చేస్తున్నారు. జీవీఎంసీ అనుమతి లేకుండా నాలుగు అడుగుల దుకాణాలు కాస్త 6 నుంచి 8 అడుగులుగా మార్చుకుని వ్యాపారాలు చేసుకుంటున్నారు.



ఆక్రమణలో ఉన్న జీవీఎంసీ ఫ్రూట్‌మార్కెట్ దుకాణ సముదాయం



చర్యలు తీసుకుంటాం..
ప్రస్తుతం పూర్ణా మార్కెట్ బయట ట్రాఫిక్ సమస్య లేకుండా ఆక్రమణలు తొలగించాం. మార్కెట్‌లో ఎన్ని దుకాణాలు ఉన్నాయి.. ఎవరి పేరు మీద ఉన్నాయనే విషయాలపై దృష్టి సారించాం. దీనిపై నివేదిక ఇవ్వాలని రెవెన్యూ అధికారులను ఆదేశించాం. త్వరలోనే పర్యవేక్షించి మార్కెట్ లోపల దుకాణాల లెక్క సరిచేస్తాం. తదనుగుణంగా చర్యలు చేపడతాం.
– ఎం. మల్లయ్యనాయుడు, జోనల్ కమిషనర్, జోన్-4.

జగన్‌మోహన్‌రెడ్డి ఆశయ సాధనకు కృషి

మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్



ఆర్థిక సాయం అందజేస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్

డాబాగార్డెన్స్: బాబాసాహెబ్ అంబేడ్కర్ అడుగుజాడల్లో నడుస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి ఆశయ సాధనకు తానెప్పుడూ ముందుంటానని మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ తెలిపారు. 31వ వార్డు కృష్ణాగార్డెన్స్‌లో నివసిస్తున్న యువకుడు పోడుసుల నాగరాజు వెన్నుపూస విరిగి, ఆపరేషన్ చేయించుకోలేని స్థితిలో ఉన్న విషయాన్ని వార్డు నాయకుడు దొడ్డి బాపూ ఆనంద్ ద్వారా తెలుసుకున్న వాసుపల్లి పార్టీ నేతలతో కలిసి బాధితుడి ఇంటికి వెళ్లి పరామర్శించారు. సొంత నిధుల నుండి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధితుడి కుటుంబానికి అండగా ఉంటానని భరోసా కల్పించారు. రాష్ట్రంలో అంబేడ్కర్ రాజ్యాంగం అమలు కావడం లేదని, రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో వార్డు నాయకుడు దొడ్డి బాపూ ఆనంద్, పిలకా మోహన్, కాండ్రేగుల నాయుడు, పెంటకోట నాగరాజు, రాము, మస్తాన్, నొడగల కిషోర్, బర్ల వీరుబాబు, రీసు అనురాధ, పీతల వాసు, ముత్తాబత్తుల రమేష్, భీశెట్టి ప్రసాద్, లండా రమణ, సువార్తరాజు, వాసుపల్లి బంగారమ్మ, తాడి రవితేజ, ఆకుల శ్యామ్‌కుమార్, బెవర మహేష్, సూర్యనాయుడు, అప్పారావు, దూడ అప్పారావు, సాగర్, నౌషధ్ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిమాపక పరికరాలపై అవగాహన ఉండాలి



మత్స్యకారులకు పరికరాలు పంపిణీ చేస్తున్న విజయకృష్ణ

మహారాణిపేట: ఫిషింగ్ నౌకల్లో ఉపయోగించే వివిధ అగ్నిమాపక పరికరాలపై అవగాహన ఉండాలని మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.విజయకృష్ణ అన్నారు. గురువారం పెదజాలారిపేటలోని కమ్యూనిటీ హాల్లో సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ నాటికల్ అండ్ ఇంజినీరింగ్ ట్రైనింగ్(సీఐఎఫ్ఎన్ఈటీ) యూనిట్, మత్స్యశాఖ సంయుక్తంగా నిర్వహించిన సముద్రంలో జీవిత భద్రత అనే అంశంపై ప్రసంగించారు. నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంటు బోర్డు ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎంఎస్‌వై) పథకం కింద శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా విజయకృష్ణ మాట్లాడుతూ సముద్రంలో వేట సమయంలో అగ్ని ప్రమాదం సంభవిస్తే బయట పడే వివిధ పరికరాలు ఉన్నాయన్నారు. ఇలాంటి పరికరాలపై మత్స్యకారులు అవగాహన కలిగి ఉండాలన్నారు. వివిధ శాఖలకు చెందిన వెంకటేశ్వర్లు, అభిషేక్, దీపక్, సుశాంత్ తదితరులు వివిధ అంశాలపై మత్స్యకారులకు అవగాహన కల్పించారు. ఈ శిక్షణ కార్యక్రమానికి 50 మంది మత్స్యకారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మత్స్యకారులకు పలు పరికరాలను ఏడీ విజయకృష్ణ పంపిణీ చేశారు.

4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలి



ధర్నాలో పాల్గొన్న హమాలీలు, ముఠా కార్మికులు, ఏఐటీయూసీ నాయకులు

సీతమ్మధార: సివిల్ సప్లయి హమాలీలను రాష్ట్ర ప్రభుత్వం 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎం. మన్మథరావు డిమాండ్ చేశారు. గురువారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఆంధ్రప్రదేశ్ స్టేట్ సివిల్ సప్లయి హమాలీల యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మన్మథరావు మాట్లాడుతూ పౌర సరఫరాల వ్యవస్థ ప్రారంభం నుండి పని చేస్తున్నప్పటికీ వీరి సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. ఇప్పటికైనా వీరి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. హమాలీలు అనేక ప్రమాదాలకు గురవుతున్నారని, వీరికి కనీసం వైద్యం కూడా లభించడం లేదన్నారు. వీరికి తక్షణం ఈఎస్ఐ అమలు చేయాలని కోరారు. పీఎఫ్ ద్వారా చనిపోయిన వారి కుటుంబాలకు పెన్షన్ సౌకర్యం అమలు చేసి, 60 సంవత్సరాల నుండి కార్మికులందరికీ పీఎఫ్ సొమ్ము అందజేసి పెన్షన్ అందించాలని కోరారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జి. ఎస్.జె. అచ్యుతరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ పడాల రమణ, సీహెచ్ కాసుబాబు, సీహెచ్ గురుమూర్తి, హమాలీలు, ముఠా కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

డాబాగార్డెన్స్: వాడపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయానికి ఏపీఎస్‌ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు నడుపుతుందని జిల్లా ప్రజా రవాణా అధికారి బి. అప్పలనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సర్వీస్ ప్రతి శనివారం ఉదయం 4 గంటలకు ద్వారకా బస్టేషన్ నుంచి బయలుదేరి, వాడపల్లి చేరుకుంటుందని, భక్తుల ప్రదక్షిణలు, దర్శనం అనంతరం సాయంత్రం 4 గంటలకు వాడపల్లిలో బయలుదేరి రాత్రి 9 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుందన్నారు. మధ్యాహ్నం భోజన సదుపాయం వాడపల్లి ఆలయంలో ఉంటుందన్నారు. ప్రయాణ చార్జీ(ఒక్కరికి) సూపర్ లగ్జరీ రూ.1000గా నిర్ణయించామన్నారు. టికెట్లు కావల్సిన వారు ఆన్‌లైన్‌లో www.apsrtconline.in వెబ్‌సైటులో విశాఖపట్నం-వాడపల్లి రూట్ సెలెక్ట్ చేసి సీట్స్ రిజర్వ్ చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9959225602, 9052227083, నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఆకట్టుకున్న బాలకృష్ణ నిర్విరామ సంగీత విభావరి

అల్లిపురం: సినీ నటుడు, పద్మభూషణ్ నందమూరి బాలకృష్ణ నిర్విరామ సంగీత విభావరి అల్లూరి విజ్ఞాన కేంద్రంలో గురువారం ఉత్సాహభరితంగా సాగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, కంచర్ల అచ్యుతరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎస్ఎస్ఎల్ఎస్ క్రియేషన్స్, ఉపకార్ ఛారిటబుల్ ట్రస్ట్, కంచర్ల వర్కింగ్ జర్నలిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ కళాకారులు, గాయకులు తమ ప్రతిభను ప్రదర్శించి, ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభిస్తున్న కమిటీ సభ్యులు

తాటిచెట్లపాలెం : రైల్వే న్యూ కాలనీలోని షిర్డీ సాయిబాబా ధ్యాన మందిరం ప్రాంగణంలో నిర్వాహకులు, ఆలయ కమిటీ సభ్యులు గురువారం చలివేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు మాట్లాడుతూ వేసవి కాలంలో ఈ మార్గంలో వెళ్లే బాటసారులు, పాదచారుల దాహార్తి తీర్చేందుకు 1997లో చలివేంద్రం ప్రారంభించామని, అప్పటి నుంచి 28 సంవత్సరాలుగా ఏటా నిర్వహిస్తున్నామని తెలిపారు. దాతలు, భక్తుల సహకారంతో రోజూ తాగునీరు, ప్రతి గురువారం మజ్జిగ పంపిణీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏయూ వాకర్స్ గ్రూప్ సభ్యులు, త్రిపురాన రాంబాబు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు ఆదేశం



కేజీహెచ్‌లో పర్యటిస్తున్న అడ్మినిస్ట్రేటర్, డిప్యూటీ కలెక్టర్ బీవీ రమణ

మహారాణిపేట: కేజీహెచ్‌కు వచ్చే రోగులకు సకాలంలో మెరుగైన వైద్య సేవలతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు పటిష్ట చర్యలు చేపడుతున్నామని అడ్మినిస్ట్రేటర్, డిప్యూటీ కలెక్టర్ బీవీ రమణ తెలిపారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా గురువారం ఆస్పత్రిలోని క్యాజువాలిటీ, ధోబీ వార్డు, ట్రమా యూనిట్‌లోని పలు విభాగాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రి ఆవరణతో పాటు అన్ని వార్డులను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. రోగులు, వారి సహాయకులకు అందుతున్న సేవలతో పాటు మౌలిక సదుపాయాలకు సంబంధించిన అంశాలపై తనిఖీ చేశారు. ఎక్కడా అపారిశుధ్య వాతావరణం లేకుండా తక్షణమే చర్యలు చేపట్టాలని సూచించారు. ఓపీ, క్యాజువాలిటీ విభాగంతో పాటు ఇతర ప్రాంతాల్లో కూడా రోగులకు వేసవిని దృష్టిలో ఉంచుకొని తాగునీటికి ఇబ్బంది లేకుండా పూర్తిస్థాయిలో సదుపాయాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి చీఫ్ డైటీషియన్ రమణమూర్తితో పాటు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

నామినేటెడ్ పదవులు కేటాయించాలి



మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

డాబాగార్డెన్స్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భర్తీ చేస్తున్న నామినేటెడ్ పదవుల్లో ఉత్తరాంధ్రకు చెందిన శిష్టకరణాలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ శిష్టకరణ అసోసియేషన్ అధ్యక్షుడు పోలుమహంతి ఉమామహేశ్వరరావు, కార్యదర్శి బెలగాం జయబాబు విజ్ఞప్తి చేశారు. నగరంలోని ఓ హోటల్లో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర కార్యవర్గానికి తాము ఎటువంటి ఎన్నిక నిర్వహించలేదని, ఇటీవల కొంత మంది తమ పేరు ఉపయోగించి, ఇతర ప్రాంతాల నుంచి వచ్చి తాము రాష్ట్ర నాయకులమని గుర్తింపు పొందే ప్రయత్నం చేస్తే ఉత్తరాంధ్ర వాసులు వారి నాయకత్వాన్ని సమ్మతించలేదన్నారు. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం ఉమ్మడి జిల్లాలో దాదాపు మూడున్నర లక్షల మంది శిష్టకరణాలు ఉన్నారని, వీరంతా ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వెనుకబడి ఉన్నారని, వీరికి తక్షణం కార్పొరేషన్ కేటాయించి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఎక్కడి నుంచో వచ్చి ఇక్కడ 30 మందితో ఎన్నికై రాష్ట్ర అధ్యక్షుడిగా పేరు పెట్టుకున్న నేతలకు ప్రభుత్వాలు ఎట్టి పరిస్థితుల్లో అవకాశం ఇవ్వకూడదన్నారు. రాష్ట్రంలో గుర్తింపు పొందిన సంస్థ తమదేనన్నారు. సమావేశంలో సంఘం ప్రతినిధులు పీవీటీ రమణారావు, బలివాడ హరిబాబు, పావని, సన్‌మూర్తి, మంత్రి ఉమామహేశ్వరరావు, బీఆర్ఎం పాత్రో తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రేణుక యల్లమ్మ తొలేళ్లు



విశేష అలంకరణలో రేణుక యల్లమ్మ అమ్మవారు



విద్యుత్ దీపాలంకరణలో రేణుక యల్లమ్మ ఆలయ పరిసరాలు

అల్లిపురం: కెప్టెన్ రామారావు జంక్షన్‌లో వెలసిన రేణుక యల్లమ్మ వార్షిక జాతరలో భాగంగా గురువారం తొలేళ్లు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఉదయం నుంచి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి తొలిపూజను ఆలయ గౌరవాధ్యక్షుడు పీల అప్పలనాయుడు, కార్యవర్గ సభ్యులు నిర్వహించారు. అమ్మవారి ప్రధాన ఆలయంతో పాటు అచ్చియ్యమ్మపేట వీధులన్నీ విద్యుత్ దీపాలంకరణలో అలంకరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. అమ్మవారి జన్మనక్షత్రం మగశిర నక్షత్రంలో అమ్మవారి ప్రధాన జాతర శుక్రవారం ఉదయం నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ గౌరవాధ్యక్షుడు పీల అప్పలనాయుడు, అధ్యక్షుడు కర్రి నీలకంఠం, కార్యదర్శి బొడ్డు పోలారావు తెలిపారు. సాయంత్రం దేవాలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాల నడుమ అమ్మవారి అనుపు ఉత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు.

కింద పడిన స్టాపర్..



నగరంలో రద్దీ ప్రాంతం జగదాంబ జంక్షన్. ఇక్కడ ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు పోలీసులు శ్రమ పడుతుంటారు. అందులో భాగంగా వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు పలు చోట్ల స్టాపర్లు కూడా ఏర్పాటు చేశారు. అయితే గురువారం ఒక స్టాపర్ కింద పడిపోయి ఇలా దర్శనమిచ్చింది.

– ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

• నిత్యం అదే దృశ్యం..



ఉత్తరాంధ్ర ఆరోగ్య ప్రదాయిని కేజీహెచ్‌కు నిత్యం రోగుల తాకిడి మామూలే. గురువారం న్యూరో మెడిసిన్ అవుట్ పేషెంట్ (ఓపీ) కోసం రోగులు బారులు తీరారు.

– ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం